

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయీ, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయీ... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**ఉదయం వెన్నెల** ఫోన్ చెయ్యడంతో నిద్రలేచాను కానీ అప్పటికే చాలా ఆలస్యం కావడంతో కేవల పళ్ళు తోముకుని లగేజ్‌తో పరుగెత్తాను. ఆయాసపడుతూ కారెక్కడం చూసి "ఏం ఫరవాలేదులే. టైం ఉంది" అంది వ్నెల.

"నాకు మెలుకువ రాలేదు"

"ఇక్కడ ఎయిర్‌పోర్ట్‌లో అంత రష్ ఉండదు. సెక్యూరిటీచెక్ ఫాస్ట్‌గా అయిపోతుంది"

"అయితే బావుండు"

"ఆన్‌లైన్ చెకిన్ చేసావు కదా?"

"య, చేసాను."

"చెకిన్ ఏం చెయ్యట్లేదుగా?"

"లేదు చెయ్యట్లేదు"

"అయితే డైరెక్ట్ వెళ్ళిపోవచ్చు కాబట్టి ప్రాబ్లం కాదులే"

"సరైతే" తన మాటలు నమ్మకుండానే తలూపాను.

"మీ అన్నయ్య వస్తాడా పిక్ చేసుకోడానికి"

"అవును" అదేం ప్రశ్న అనుకున్నాను. నా మనసులో మాట వినబడినట్టే,

"నా ఫ్రెండ్ ఒకాముండేది. వాళ్ళ అన్నయ్య కూడా ఇలానే పిలిచెవాడు కానీ, ఎయిర్‌పోర్ట్‌లో వెయిట్ చేసేది గంటలు తరబడి. కొన్నిసార్లు టాక్సీ తీసుకుని రమ్మనేవాడు" చెప్పింది.

"అవునా? అదేంటి?" ఎంతో ఆశ్చర్యపోయాను.

"అవును. ఆఫీసునుండి తొందరగా వెళ్తే వెకేషన్ టైం అయిపోతుందని వెయిట్ చెయ్యమనేవాడట. పీక్ అవర్స్ అయితే ట్రాఫిక్ ఉంటుందని తననే వచ్చేయమనేవాడట"

ఇలా కూడా ఆలోచిస్తారా అని ఆశ్చర్యపోతుండగా,

"చాలా ప్రాక్టికల్" అంది వెన్నెల.

నా ప్రమేయంలేకుండానే "ప్రాక్టికల్ కాదు, సెల్ఫిష్" అనేసాను.

తను తిట్టుకుంటుందేమో అని భయపడ్డాను కానీ,

"ఇంక అంతే ఏం చేస్తాం? ఇలా ప్రాక్టికల్ అని సర్దిచెప్పుకోవాలంతే" చిన్నగా నవ్వింది.

ఇంతలో ఎయిర్‌పోర్ట్ చేరాము.

"లోపలికి రావాలా, నువ్వు వెళ్ళిపోతావా?" అడిగింది.

తను కూడా వస్తే 'టాటా, బాయ్ బాయ్‌ల'తో టైం ఇంకా వేస్ట్ అయ్యి ఫ్లైట్ మిస్ అవుతానని

"నేను వెళ్ళిపోతానులే. కాని కొంచెం సేపు వెయిట్ చేస్తావా? ఫ్లైట్ మిస్ అయితే కాల్ చేస్తాను"

"సరే, వెయిట్ చేస్తానులే" నవ్వింది.

నేను వెంటనే కారు దిగి సూట్ కేస్ తీసుకుని గబగబా వెళ్ళాను. సెక్యూరిటీచెక్ లైన్‌లో ఆగితే కానీ ఎంత ఆయాసపడుతున్నా అని తెలుసుకోలేదు. నా వెనక వచ్చి నిలబడిన వారు నవ్వు ఆపుకోవడం గమనించాను. పాపం ఇంత చిన్న విషయానికి కూడా నవ్వలేకపోతే ఇంక జీవితం ఎందుకు అని వారిని చూసి చిన్నగా నవ్వాను. వారుకూడా నవ్వడం ప్రారంభించారు.

"ఐ లేట్ ఫ మై ఫ్లైట్" అన్నాను.

"వాట్ టైం?" అడిగారు.

విచిత్రమేంటంటే వారుకూడా నా విమానమే అట. నేను ఆపసోపాలు పడడం చూసి వారు ఇంకా నవ్వారు.

"యు ఆర్ నాట్ లేట్. యూ ఆర్ అర్లీ" అన్నారు.

వెన్నెల చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చాయి కానీ మనఃశాంతి మాత్రం కలిగింది. సెక్యూరిటీ చెక్ పూర్తవ్వగానే గేట్ దగ్గర కుర్చున్నాను. బోర్డింగ్‌కి ఇంకా పదిహేను నిమిషాలుంది. వెంటనే వెన్నెలకి ఫోన్ చేసి ఇంటికి వెళ్ళమన్నాను.

"నేను చెప్పానా లేట్ అవ్వలేదని" అంది.

కాసేపు ఫోన్‌లో పాటలు వింటూ ఊపిరి పీల్చుకున్నాను. ఇంతలో విమానం మొత్తం బుక్ అవ్వడంవల్ల కొంతమంది పెట్టెలు ఫ్రీ చెకిన్ చేస్తామని అనౌన్సు చేసారు. చుట్టుపక్కలవారు వెళ్ళి సూట్‌కేస్‌ని ఎలా ఇస్తున్నారో గమనించాను. నేను ఇవ్వాలా వద్దా అని చాలాసేపు ఆలోచించాను. ఆ సూట్‌కేస్‌ని ఎత్తిపెట్టే కన్నా ఇది చాలా సుఖంగా ఉంటుంది. కానీ తెలీని భయం. చివరికి ధైర్యం చేసి వెళ్ళాను. బోర్డింగ్ పాసు చూసి కొలరాడోలో బాగేజ్ క్లైమ్ లో తీసుకోమని బోర్డింగ్ పాస్ ప్రింట్ చేసి స్టిక్కర్ అతికిచ్చి నా చేతికిచ్చింది.

ఏదో పెద్ద ఘనకార్యం చేసినంత ఆనందం కలిగింది. వెంటనే అన్నయ్యకి ఫోన్ చేసాను.

"బయలుదేరావా ఎయిర్‌పోర్ట్‌కి?" అడిగాడు.

"ఎయిర్‌పోర్ట్‌లోనే ఉన్నాను."

"అప్పుడేనా? ఇంకా గంట ఉందిగా?"

"గంటా?"వెంటనే బోర్డింగ్ పాస్ చెక్ చేసాను, "ఇంకో ఫైవ్ మినిట్స్‌లో బోర్డింగ్" చెప్పాను.

"ఓ...సారీ. టైం డిఫరెన్స్ మర్చిపోయాను."

వెన్నెల ఫోన్ నుండి సూట్‌కేస్ చెకిన్ వరకు అంతా పూసగుచ్చినట్టు చెప్పాను.

"మొత్తానికి బారిష్టర్ పార్వతీశం నుండి కాస్త మారుతున్నావన్నమాట నవ్వాడు.

విచిత్రంగా కోపం రాలేదు. నేను కూడా నవ్వాను. ఇంతలో బోర్డింగ్ మొదలవుతుందని అనౌన్స్ చేసారు" నేను పెట్టెస్తా బోర్డింగ్ స్టార్ట్ అయ్యింది" అన్నాను.

"నీకు చీప్ టికెట్ కొన్నానే, ఫస్ట్‌క్లాస్ కాదు అందరూ ఎక్కిన తరవాత నిన్ను పిలుస్తారు" పెద్దగా నవ్వాడు.

ఇక్కడ కోపం వచ్చింది నాకు. వెంటనే ఫోన్ కట్ చేసాను. పక్కనే ఉన్న షాపులో ఒక స్నిక్కర్స్ ఇంక కోక్ టిన్ కొన్నాను. అన్నయ్య ఇండియాకి వచ్చినపుడు స్నిక్కర్స్‌ని నేను, అమ్మ పంచుకునేవాళ్ళం. నాకు వేరుసెనగపప్పు ఇష్టం లేకపోవడంతో చివరికి అమ్మ నా స్నిక్కర్లు, నేను అమ్మ మార్స్ చాక్లెట్ ఎక్సేంజ్ చేసుకునే వాళ్ళం వెంటనే కళ్ళల్లో తడి ఏర్పడింది. నేను ఆపే ప్రయత్నం చెయ్యక పోవడంతో కళ్ళలోంచి నీరు కారింది.

"యూ డిడ్ నాట్ మిస్ ద ఫ్లైట్. రిలాక్స్" ఎవరో అనడంతో కళ్ళు తుడుచుకుని చూసాను. ఇందాక సెక్యూరిటీ చెక్‌లో నా వెనక నిలబడినవారు. అక్కడ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. నా ఏడుపు చూసి నవ్వించే ప్రయత్నం చేసారని అర్థమై థాంక్స్ చెప్పి లైన్‌లో నిలబడ్డాను. అన్నయ్య చెప్పినట్టే అందరూ ఎక్కిన తరవాత ఆఖరికి జోన్ 4ని పిలిచారు. బోర్డింగ్ మొదలైన దాదాపు పావుగంటకి కానీ నేను ఎక్కలేదు. కూర్చున్న వెంటనే "బోర్డెడ్" అని అన్నయ్యకి, వెన్నెలకి మెసేజ్ పంపాను. అన్నయ్యని కలుస్తున్నానని ఎంతో ఆనందం వేసింది. ఫోన్ ఎయిరోప్లేన్ మోడ్‌లో పెట్టి కిటికీలోంచి చూస్తూ నిద్రలోకి జారుకున్నాను.

కాసేపయ్యాక ఎవరో గట్టిగా మాట్లాడ్డంతో మెలుకువ వచ్చింది. లైన్‌లో వెనక నిలబడినవారు గట్టిగా మాట్లాడుకుంటున్నారు. ఈలోగా ఎయిర్‌హోస్టెస్ వచ్చి నీళ్ళు, బిస్కెట్స్ ఇచ్చింది.

కిటికీలోంచి చూస్తూ "ఏదో ఒక రోజు నేను కూడా విమానం నడుపుతాను" అనుకుంటూ మళ్ళీ నిద్రలోకి జారాను. లాండ్ అయిన వెంటనే 'లాండెడ్' అని మెసేజ్ చేసాను. ఫ్లైట్ దిగే సమయానికి నా ఆనందానికి అవధులు లేవు. పెద్దగా చుట్టుపక్కల వారిని గమనించలేదు. కానీ "యూ సీం హాపీ" అన్న కంఠం మాత్రం వినబడింది. అది నన్నా, వేరే ఎవరినోనా అన్న విషయం కూడా పట్టించుకోకుండా గబగబా బయటకి వెళ్ళాను. బాగేజ్ క్లైం బెల్ట్ దగ్గర మా ఫ్లైట్‌లో వాళ్ళ మొహాలు చూసి అక్కడికి నడిచాను. ఇంతలో అన్నయ్య ఫోన్ చేసి సూట్ కేసు రాగానే బయటకి వెంటనే రమ్మన్నాడు. ఎక్కువసేపు అక్కడ కారు ఆపకూడదట. నా సూట్‌కేస్ కనపడిన మరుక్షణం దాన్ని తీసుకుని పీటి ఉషలా బయటకి వెళ్ళాను. అన్నయ్య కారులోంచి చెయ్యి ఊపాడు. పొద్దునలానే ఆయాసపడుతూ కారెక్కి ఊపిరి పీల్చుకున్నాను. అన్నయ్య మాత్రం నవ్వుతూనే ఉన్నాడు.

"బయట తినేసి వెళదామా ఇంటికి?" అడిగాడు.

"యా, ఓకే" ఫ్లైట్ కబుర్లన్నీ చెప్పాను.

పిఎఫ్ చాంగ్స్‌లో కూర్చున్నాక వెయిటర్ వచ్చినప్పుడు నేను ఎగ్ డ్రాప్ సూప్ ఆర్డర్ చేసాను.

అన్నయ్య ముందు కేవలం నీళ్ళు తెమ్మని పంపేసాడు. 'ఎందుకు' అని నేను అడిగేలోపు "నువ్వు నాన్ వెజ్ తింటున్నావా? నేను అమ్మకి చెప్పనులే" అడిగాడు.

"లేదు. ఛీఛీ నేను ఎందుకు తింటాను? అయినా ఎందుకు అలా అడిగావ్?" కోప్పడ్డాను.

"ఎగ్‌డ్రాప్ సూప్‌ని చికెన్ బ్రాత్‌తో చేస్తారు. అందుకే అడిగా"

"వాట్... చికెన్ బ్రాతా? అయ్యో, నేను తెలీక తినేసాను."

"ఇక్కడ చాలా వరకు సూప్ వెజిటేరియన్ ఉండవు. వాళ్ళని దేనితో చేస్తారు అని అడిగాను"

"ఓ.ఓకే నేనింకా వెజ్ అనుకున్నాను."

"నీకు నచ్చితే తీసుకోలే. నాకు ఫరవాలేదు. ఎవరికీ చెప్పను."

"లేదు. వద్దు."

అన్నయ్యనే ఆర్డర్ చెయ్యమని తిన్నాక ఇంటికి వెళ్ళాము.

"అమెరికా నచ్చిందా?" అడిగాడు.

"యా. చాలా నచ్చింది. మా కేంపసులో తెల్సా.." అంటూ గంటసేపు కథలు చెప్పాను.

"నువ్వు చేంజ్ అయ్యావు" అన్నాడు కానీ అది విమర్శలా అనిపించలేదు.

"నేనేం మారలేదు"

"ఇట్స్ ఎ గుడ్ చేంజ్. అలానే మారాలి. బి ఎ రోమన్ ఇన్ రోమ్"

"మెంటలా?"

"మనం షాపింగ్‌కి వెళ్ళాం గుర్తుందా?"

"యా, గుర్తుంది"

"అప్పుడు పొట్టివి వేసుకోనని చాలా గోల చేసావు."

"ఇప్పటికీ పొట్టివి వేసుకోను. ఇదేమైనా డ్రెస్‌లా కనబడుతుందా?" చిరాకుపడ్డాను.

"నా పేంట్ కాస్త పొట్టిదే. అప్పట్లో అయితే గోల చేసేదానివి. ఇప్పుడు కాస్త నార్మల్ అయ్యావు. మనం ఫస్ట్ టైం బయట తిండానికి వెళ్ళినప్పుడు కాఫీ ఆర్డర్ చెయ్యడానికి కూడా చాలా భయపడ్డావు. ఇప్పుడు చక్కగా మాట్లాడేస్తున్నావు .ఐ యాం సో ప్రౌడ్ ఆఫ్ యు" అన్నాడు.

అది నిజమే అని గమనించి ఆశ్చర్యపోయాను.

ఇదివరకటిలాగే నేను అన్నయ్య గదిలో, అన్నయ్య సోఫాలో పడుకున్నాం.ఫ్లైట్‌లో కునుకు తీసినా, క్షణాల్లో నిద్రపోయాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story